క్లుప్తంగా

మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి

తిర్యాణి: మహిళా సంఘాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీఎం శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలం కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలన్నారు. సమావేశంలో సీసీ ఆత్రం సంతోష్, దుర్గం శ్యాంరావు, భూక్య శ్యాంలాల్ తదితరులు ఉన్నారు.

ప్రతీ ఒక్కరు రాజ్యాంగాన్ని గౌరవించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: భారత రాజ్యాంగాన్ని ప్రతీ ఒక్కరు గౌరవించాలని మాజీ ఎంపీపీ అరిగెల మల్లిఖార్జున్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వరకు సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించి అండేడ్కర్ విగ్రహాన్ని నీటితో శుద్ధి చేసి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ వాస్తవాలను తప్పుదోవ పట్టించి పబ్బం గడుపుకోవాలని చూస్తుందన్నారు. ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు మాటూరి జయరాజ్, నాయకులు పెంటయ్య, నితిన్, శివయ్య, అజయ్, కిరణ్, రాకేశ్, చంద్ర ఆదిత్య, అభిలాష్, మడావి సాయి తదితరులు పాల్గొన్నారు.

‘రైతుభరోసా’ దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈవో శ్రీవిద్య

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని రైతు వేదికలో పెంచికల్‌పేట్ ఏఈవో శ్రీవిద్య శనివారం రైతుల నుంచి రైతుభరోసా దరఖాస్తులు స్వీకరించారు. నూతనంగా పట్టాపాసు పుస్తకాలను పొందిన రైతులు రైతుభరోసా పథకానికి పట్టా పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాసుపుస్తకం జిరాక్సులతో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

గణతంత్ర వేడుకలకు పాఠశాలలు ముస్తాబు



తోరణాలు కడుతున్న విద్యార్థులు

కెరమెరి: గణతంత్ర దినోత్సవానికి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు ముస్తాబయ్యాయి. శనివారం ఆయా బడుల్లో రంగురంగుల కాగితాలు, మామిడి ఆకులను తోరణాలుగా కట్టారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల్లో క్రీడలు కొనసాగాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్, స్కిప్పింగ్, హైజంప్, లాంగ్ జంప్ తదితర ఆటలు ఆడారు. విజేతలకు ఈ నెల 26న బహుమతులు ప్రదానం చేయనున్నారు.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలి

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జీఎం శ్రీనివాస్ అన్నారు. శనివారం భీమన్న స్టేడియాన్ని సందర్శించి గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేడియంలో చేపడుతున్న పనులను పరిశీలించారు. పరేడ్, విద్యార్థులతో ఏర్పాటు చేయబోయే సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ ఉద్యోగుల సన్మానం వంటి కార్యక్రమాల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వేడుకలకు గోలేటి, మాదారం టౌన్‌షిప్‌ల నుంచి అధిక సంఖ్యలో ఉద్యోగులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులు హాజరయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్, సివిల్ ఈఈ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కౌటాల: కౌటాల మండల ఫోటోగ్రాఫర్, వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం నూతన క్యాలెండర్‌ను సీఐ ముత్యం రమేశ్, మాజీ ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ స్థానిక మినీ స్టేడియంలో శనివారం ఆవిష్కరించారు. కమిటీ మండల అధ్యక్షుడు జాడి నగేశ్ మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం ఫొటో, వీడియో గ్రాఫర్లకు సబ్సిడీపై రుణాలు ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని కోరారు. ఎస్సై మధుకర్, సంఘం ఉపాధ్యక్షులు పెరుగు రాజు, కార్యదర్శులు జుమిడి రాజు, జితేందర్, సభ్యులు శ్రీనివాస్, నాందేవ్, జీవన్, తిరుపతి, గట్టయ్య, సతీశ్, రమణ, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం



దహెగాం: మానవహారంగా ఏర్పడ్డ విద్యార్థులు, అధికారులు



కెరమెరిలో..



కౌటాల: ర్యాలీ తీస్తున్న విద్యార్థులు, అధికారులు



లింగాపూర్: ర్యాలీలో అధికారులు

దహెగాం: మండల కేంద్రంలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి అంగడిబజార్ వరకు ర్యాలీ చేపట్టారు. ఓటు మీ హక్కు, మీ బాధ్యత, ఓటు విలువ తెలుసుకో అంటూ విద్యార్థులు ఫ్లకార్డులతో నినాదాలు చేశారు. అంగడి బజార్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. తహసీల్దార్ కవిత మాట్లాడుతూ ఓటుహక్కు చాలా విలువైనదన్నారు. కళాశాల అధ్యాపకులు దౌలత్, చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గందె వెంకటేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగాపూర్‌లో..

లింగాపూర్: మండల కేంద్రంలో శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జెడ్పీ పాఠశాల విద్యార్థులు తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ పెద్దిరాజు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాల నుంచి బస్టాండ్ వరకు నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో ఆడే ప్రకాశ్, ఎంపీడీవో అంజద్ పాషా మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు ఓటుహక్కు కలిగి ఉండాలన్నారు. చౌపన్‌గూడలో నెహ్రూ యువ జన సంఘం ఆధ్వర్యంలో శ్రీ చైతన్య యూత్ సభ్యులు ప్రతిజ్ఞ చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. జంగు, రాము, మోతిరాం, వసంత్‌రావు, నాగోరావు తదితరులు ఉన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. జెడ్పీఎస్ఎస్ పాఠశాల నుంచి విద్యార్థులతో కలిసి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. హనుమాన్ మందిర్ చౌరస్తాలో తహసీల్దార్ రియాజ్ అలీ విద్యార్థులు, ప్రజలతో ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంఈవో శివచరణ్, హెచ్ఎం నటరాజ్, అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని శనివారం అధికారులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధమన్నారు. తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో అల్బర్ట్, ఎంఈవో రమేశ్‌బాబు, కాంప్లెక్స్ హెచ్ఎం విజయలక్ష్మీ, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలో అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలని తహసీల్దార్ రామ్మోహన్ రావు అన్నారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలో బీఎల్‌వోలు విద్యార్థులతో రంగోళి నిర్వహించారు. ఓటరు ప్రతిజ్ఞ చేసిన అనంతరం విద్యార్థులకు ఓటు ప్రాముఖ్యత అంశంపై ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటుహక్కుకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుందన్నారు. ఎంఈవో వెంకటేశ్వర్లు, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం విజయరాణి బీఎల్‌వోలు, విద్యార్థులు పాల్గొన్నారు.



వాంకిడి: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

సిర్పూర్ (టి)లో..

సిర్పూర్(టి): జాతీయ ఓటరు దినోత్సవం శనివారం మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటరు దినోత్సవం నిర్వహించి విద్యార్థులతో కలిసి బస్టాండ్ ప్రాంతం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బక్కయ్య, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంఈవో వేణుగోపాల్ పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: ఓటర్ల చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని, అర్హులైన ప్రతీ ఒక్కరు ఓటుహక్కు కలిగి ఉండాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. శనివారం 15వ జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు అవగాహన ర్యాలీ తీశారు. అనంతరం ఓటర్ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్సై మధుకర్, డీటీ మస్కూర్ అలీ, పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ, హెచ్ఎం నారాయణ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలో శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ మునావర్ షరీఫ్, విద్యాధికారి జయరాజ్, ఎంపీవో సుధాకర్ రెడ్డిలు పాల్గొని ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించారు. మండల కేంద్రంలో ప్రజలు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి శివాజీ చౌరస్తాలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సీనియర్ సిటిజన్ ఓటర్లకు సన్మానం నిర్వహించారు.



పెంచికల్‌పేట్: ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



సిర్పూర్(టి): ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు



రెబ్బెన: ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ రామ్మోహన్‌రావు



కెరమెరి: చౌపన్‌గూడలో ప్రతిజ్ఞ చేస్తున్న యూత్ సభ్యులు

ఉత్తమ సేవలకు అవార్డులు



కెరమెరి: అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ దత్తు ప్రసాద్



కెరమెరి: అవార్డు అందుకుంటున్న బీఎల్‌వో స్రవంతి

కెరమెరి: 15వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శనివారం జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో తహసీల్దార్ దత్తు ప్రసాద్, బీఎల్‌వో కోగంటి స్రవంతి, సూపర్‌వైజర్ సురేశ్‌లు బెస్ట్ ఎలక్టోరోల్ ప్రాక్టీస్ అవార్డులు అందుకున్నారు. అదనపు కలెక్టర్‌లు దీపక్ తివారి, డేవిడ్, ఆర్‌డీవో లోకేశ్వర్‌లు వీరికి అవార్డులు అందించారు. గతంలో జరిగిన ఎన్నికలను నిబద్ధతతో నిర్వహించడం, ప్రజల్లో ఎన్నికల ప్రాధాన్యత తెలియజేయడంతో పాటు ఎలాంటి సంఘటనలు జరగకుండా సజావుగా నిర్వహించినందుకు అవార్డులు దక్కినట్లు అవార్డు గ్రహీతలు తెలిపారు.

బెస్ట్ బూత్ లెవల్ అవార్డు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్ అంగన్‌వాడీ టీచర్ దుర్గం తిరుపతమ్మ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా బెస్ట్ బూత్ లెవల్ అధికారి అవార్డు అందుకున్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవం వేడుకల్లో భాగంగా ఆర్డీవో లోకేశ్వర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

ఉత్తమ ఉద్యోగుల ఎంపిక



అదునూరి సుధాకర్

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలో ఉత్పత్తి సాధన, విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులను ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేసినట్లు ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి శనివారం ఒక ప్రకటనలో తె లిపారు. బెస్ట్ సింగరేణియన్‌గా బెల్లంపల్లి ఏరియా కైరిగూడ ఓసీపీలో వెల్డర్‌గా విధులు నిర్వహించే అదునూరి సుధాకర్‌ను ఎంపిక చేయగా, ఉత్తమ అధికారిగా కైరిగూడ ఓసీపీ ప్రాజెక్టు ఇంజనీరుగా విధులు నిర్వహిస్తున్న వీరన్నను ఎంపిక చేశారు. ఏరియా స్థాయిలో ఉత్తమ ఉద్యోగులుగా కైరిగూడ ఓసీపీకి చెందిన ఈపీ ఆపరేటర్ దూలం సదయ్య, జనరల్ మజ్దూర్ పర్చకి ధనలక్ష్మిలను ఎంపిక చేసినట్లు తెలిపారు. బెస్ట్ సింగరేణియన్‌గా ఎంపికైన ఉద్యోగిని ఆదివారం కొత్తగూడెంలో జరుగనున్న గణతంత్ర వేడుకల్లో సంస్థ సీఅండ్ఎండీ బలరాం సన్మానించనున్నారు. ఏరియా స్థాయిలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన ఉద్యోగులను గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో నిర్వహించే వేడుకల్లో ఏరియా జీఎం శ్రీనివాస్ సన్మానించి జ్ఞాపికలు అందజేస్తారని తెలిపారు.

బాలల సంరక్షణే ధ్యేయం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారి మహేశ్

ఆసిఫాబాద్‌అర్బన్: బాలల సంరక్షణే ధ్యేయంగా జిల్లాలో ప్రతీ గ్రామంలో బాల్య వివాహాలు, బాల కార్మికులు, బాలల అక్రమ రవాణాపై షూర్ ఎన్జీఓ ప్రతినిధులకు అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా బాలల సంరక్షణ అధికారి బూర్ల మహేశ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బాలరక్ష భవన్ కార్యాలయంలో షూర్ స్వచ్ఛంద సంస్థ పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ బాలల రక్షణకు గ్రామాల్లో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

గెలుపోటములు సహజం



బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

కౌటాల: క్రీడల్లో గెలుపోటములు సహజమని బీఆర్ఎస్ మండల కన్వీనర్ నాగపురే బండు పటేల్ అన్నారు. మండలంలోని వీర్దండి గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. మొదటి బహుమతి కౌటాల జట్టుకు రూ. 20 వేలు, ద్వితీయ బహుమతి వీర్దండికి రూ.15 వేల నగదుతో పాటు బహుమతులు అందించారు. నాయకులు నవీన్, ఆనంద్, సందీప్, ప్రశాంత్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకుందాం



కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



అంబేడ్కర్ చౌక్ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, పట్టణ ప్రజలు

ఆసిఫాబాద్‌అర్బన్: ఓటుహక్కు వినియోగించుకుని, ఆదర్శవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మించుకుందామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శనివారం జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. అదనపు కలెక్టర్(రెవెన్యూ) డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఆర్‌డీవో దత్తారావుతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడంలో అధికారులు, సిబ్బంది చేసిన కృషి అభినందనీయమన్నారు. సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్‌జెండర్లు, యువ ఓటర్లను సన్మానించారు. ఎన్నికల విధులు నిర్వహించిన పలువురికి ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన రంగోలి కార్యక్రమంలో పాల్గొన వారికి బహుమతులు అందజేశారు. కలెక్టరేట్ ఏవో మధుకర్, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ తీసి.. అవగాహన కల్పించి..

జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి 2కే రన్‌ను అదనపు కలెక్టర్ దీపక్ తివారి ప్రారంభించారు. కుమురంభీం చౌక్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్, అంబేడ్కర్ చౌక్ వరకు కొనసాగింది. అంబేడ్కర్ చౌక్ వద్ద అదనపు కలెక్టర్ ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం అధికారులు, పట్టణ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్(రెవెన్యూ) డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీఆర్‌డీవో దత్తారావు, డీపీవో భిక్షపతిగౌడ్, తహసీల్దార్ రోహిత్, ఏవో మధుకర్, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ మోహన్

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎంవీఐ మోహన్ వాహనదారులకు సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు తెలియజేయడానికి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. రాజమల్లు, రవి పాల్గొన్నారు.

తుమ్మిడిహెట్టి వద్ద ‘ప్రాణహిత’ నిర్మించాలి

కౌటాల: తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మించాలని తెలంగాణ జలసాధన కన్వీనర్ నైనాల గోవర్ధన్ డిమాండ్ చేశారు. కౌటాలలోని ఆరె సంఘం భవనంలో శనివారం వామపక్ష సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రైతులకు సాగునీరందించాలనే ఉద్దేశంతో చేపట్టిన ప్రాణహిత-చెవేళ్ల ప్రాజెక్టును అక్రమంగా కాళేశ్వరానికి తరలించారని ఆరోపించారు. రాజకీయ, వామపక్ష ప్రజాస్వామిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న మంచిర్యాలలో జిల్లా సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో సభ్యులు లాలాకుమార్, చంద్‌పాషా, శంకర్, జైపాల్‌సింగ్, శ్రీనివాస్, తిరుపతి, పోచన్న, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానాన్ని సిద్ధం చేయాలి



క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న మల్లికార్జున్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బాలుర పాఠశాల క్రీడా మైదానాన్ని ఈనెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే క్రీడా పోటీల కోసం సిద్ధం చేయాలని మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ అన్నారు. శనివారం స్థానిక బాలుర పాఠశాల క్రీడా మైదానాన్ని ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం క్రీడామైదానం క్రీడలకు అనుకూలంగా లేదని, చదును చేయడానికి పూర్వ విద్యార్థులు ముందుకు వచ్చారని పేర్కొన్నారు. పాఠశాలపై తనకున్న అనుబంధంతో మరమ్మతులు చేయిస్తున్నట్లు తెలిపారు. నాయకులు పెంటయ్య, బాల్దారపు మధుకర్, తదితరులు ఉన్నారు.

‘అంబేడ్కర్ ఆశయాల కోసం పని చేద్దాం’



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

రెబ్బెన: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల కోసం కలిసి పని చేద్దామని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ అన్నారు. గోలేటిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం సంవిధన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ 1950 జనవరి 26న రాజ్యాంగాన్ని ఆమోదించిన తరువాత భారతదేశం సర్వసత్తాక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా అవతరించిందన్నారు. అంబేడ్కర్‌ను, రాజ్యాంగాన్ని అవమానించిన కాంగ్రెస్ పార్టీకీ ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు క్రిష్ణకుమారి, మండల అధ్యక్షుడు మల్రాజు రాంబాబు, నాయకులు తిరుపతి, నవీన్ గౌడ్, రాజేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.